# "నీవు నిజంగా స్వస్థత పొందగోరుతున్నావా?"
## (యోహాను 5:1-16)

యోహాను 5లో యేసు ఒక వింతైన ప్రశ్న నడిగారు. రోగియైన ఒకని యొద్దకు ఆయన వచ్చి, నీవు ''స్వస్థ పడగోరుతున్నావా?'' అని అడిగారు (6వ.). అతడు ముప్పది ఎనిమిది ఏండ్లనుండి రోగియై యున్నట్టు 5వ వచనం సూచిస్తుంది. అయినా తాను నిజంగా స్వస్థత పొందగోరుతున్నాడా అని యేసు అతని నడిగారు!

అలా చూడగానే, ఈ క్రింది ఉదాహరణల్లో ఒకటిగా నున్నట్టు అది గోచరిస్తుంది - గమనించు. కారు పూర్తిగా నొక్కి వేయబడింది. అందులో తలపగిలి రక్తం కారుతూ, అవయవాలు వికృత కోణాల్లో అంటుకుపోయి, భయంకరమైన పరిస్థితిలో ఒకడున్నాడు. ఆ స్థలాన్ని ఒకడు సమీపించి, ఆ కారులో ఉన్నవాన్ని చూచి - "నీవు బాగానే ఉన్నావా?" అని అడిగాడట! లేదా, నడినెత్తి మొదలుకొని అరకాలు వరకు కట్లతో చుట్టబడి, బాధవలన ఒకనికి ముఖం వికారంగా మారి పోయిందట. పైగా అతని దేహం యంత్రంలో అసంఖ్యాకములైన ట్యూబులు వైర్లు అనే వాటితో అతుకబడి యుందట. అలాటి పరిస్థితిలో ఉన్న తన స్నేహితుని చూడాలని ఒక స్త్రీ ఆసుపత్రి రూములోనికి వచ్చి - ''బాధగావుందా?'' అని అడిగిందట!

ఈ ఉదాహరణలను వ్యక్తిగతంగా తీసికోవాలంటే - ఈ క్రింది వాటిని గమనించు. నీవు బాగులేని స్థితిలో కాలం గడుపుతున్నా వనుకో, "నీవు బాగుండాలని కోరుకొంటున్నావా?'' అని ఎవరో ఒకరు నిన్ను అడిగితే, లేదా, నీతో అసమ్మతిగా నున్న వ్యక్తిని గూర్చి ఒకడు ప్రస్తావించి, ''అతనితో నీవు సక్కపడాలనుకుంటు న్నావా?'' అని నిన్ను అడిగితే; లేదా, నీ వివాహమో, గృహమో ఉండవలసిన తీరులో లేకపోగా, ''నీకు మేలైన వైవాహిక జీవితం, మేలైన గృహం కావాలా?'' అని ఒకడు నిన్నడిగితే; లేదా, నీ మనస్సాక్షి దోషారోపణతో ఉండగా, ''దోషారోపణను పోగొట్టుకో గోరుతున్నావా?" అని ఒకడు నిన్నడిగాడనుకో!

నీ ప్రతి చర్య ఏమైయుంటుందంటే - ''ఏమీ ఈ వింతైన ప్రశ్న! నేను తప్పక మేలు అనుభవించగోరతాను. (ఇతరులతో సక్కగా ఉండడంలో, లేక, మంచి వివాహం, గృహం, దోషారోపణ లేని స్థితి, వగైరాలను తప్పక కోరుతాను) నీవు

యిలా అడగడం ఎంతో వింతగా వుందే!'' అని అంటావ్. అవి మనకందరికి కావాలి కదా? ఇలాటి ప్రశ్నలు మనస్సులో ఉంచుకొని మనం యోహాను 5:1-16 ను చదువుదాం.

యేసు తన గలిలయ పరిచర్యను ప్రారంభించారు. ఈ పరిచర్యలో ఒక విశేషం రోగులను బాగుచేయడం. (ప్రభువైన) యేసు జనులకు బోధించారు, బాగు చేశారు. ఇందులో రెండు విషయాలు సంభవించాయి. (1) జన సమూహం పెదిగింది (2) వ్యతిరేకత కూడా ఎక్కువయ్యింది. ఈ పాఠంలో స్వస్థత పొందిన ఒక సంఘటనను చదువుదాం. వ్యతిరేకతను అది ఎలా రేపిందో గమనించుదాం. ఈ సంఘటనగుండా వెళ్ళుతూ ''నీవు నిజముగా స్వస్థ పడగోరుచున్నావా?'' అని ప్రభువు అడిగిన ఆ వింతైన ప్రశ్నను పరిశీలించి చూద్దాం.

## కోనేటి వద్ద యేసు ఒక మనుష్యుని స్వస్థపరచారు

బేతెస్ద అనే కోనేటి యొద్ద స్వస్థపరచబడిన యొక మనుష్యుని మొదటిగా చూద్దాం. అది మూడు విధాల స్వస్థతయని నేనంటున్నా!

### శరీర స్వస్థత (యోహాను 5:1-6)

అయిదవ అధ్యాయం యిలా ప్రారంభమౌతుంది, ''అటు తరువాత యూదుల పండుగ యొకటి వచ్చెను. గనుక యేసు యెరూషలేమునకు వెళ్లెను'' (1 వ.). ''ఒక పండుగ''[1] అనేది యొక సామాన్యమైన పండుగై యుండవచ్చు. యూదుల్లో పురుషులందరు రావలసిన అవసరముండదు. ''అవసరమైనప్పుడే'' కూడికలకు వెళ్ళే వారిలా కాకుండ, ఆరాధించగోరి యేసు అక్కడికి వెళ్ళినట్టున్నారు.

''యెరూషలేములో గొఱ్ఱెల ద్వారము దగ్గర, హెబ్రీ భాషలో బేతెస్ద అనబడిన యొక కోనేరు కలదు, దానికి అయిదు మంటపములు కలవు'' (2 వ.). ఈ గొఱ్ఱెల ద్వారం బలి కొరకైన గొఱ్ఱెలు పోగు చేయబడే ద్వారమై యుండవచ్చు.

ఇక్కడ చెప్పబడిన ఆ కోనేరు నేటికినీ వుంది. ''బేతెస్ద'' అంటే కనికరపుటిల్లు అని భావం కావచ్చు. అయిదు మంటపాలనేవి కంచెతో మూయబడియుంటాయి. తరువాత కన్పించే దృశ్యం హృదయాన్ని చీల్చివేస్తుంది. ''ఆ మంటపములలో రోగులు, గ్రుడ్డివారు, కుంటివారు, ఊచకాలు చేతులు గలవారు గుంపులుగా పడియుండిరి'' (4 వ). అక్కడ దుర్వాసన అధికంగాను, పరిస్థితులు నిరాశాజనికంగాను ఉండేవి. దృశ్యాలు, శబ్దాలు, వాసనలు సులభంగా కడుపును వేదించేవిగా ఉన్నాయి.

ఈ సందర్భంలో KJV ఈ మాటలను కలుపుతుంది:

> ''... ఆయా సమయములకు దేవదూత కోనేటిలో దిగి నీళ్లు కదిలించుట కలదు. నీరు కదలింపబడిన పిమ్మట, మొదట ఎవడు దిగునో వాడు ఎట్టి వ్యాధిగల వాడైనను

బాగుపడును'' (3-4a వ.)

ఈ వివరణ ఆది చేతిప్రతుల్లో లేనట్టుంది. అయితే అప్పటి శాస్త్రులు చేసిన వ్యాఖ్యానం లేఖన భాగంలోనికి వచ్చినట్టుంది. ఆ చోటికి జనులను రాబట్టడానికి ప్రాచీన మూఢ నమ్మకాన్ని ఆ మాటలు చెప్పుతున్నాయి. (7వ వచనం గమనించు) బేతెస్ద ఆ కోనేరు అంతర్గత ఊటలచే పోషింపబడుతూ ఉండేది. ఆయా సమయాల్లో ఉబికే బుగ్గల వలన జరిగే కదలికను దేవదూత కదిలించినట్టు జనులు భావించినట్టున్నారు.

''అక్కడ ముప్పది యెనిమిది ఏండ్లనుండి వ్యాధిగల యొక మనుష్యుడుండెను'' (5వ.). తన జీవితమంతా కాకపోయినా, జీవితంలో ఎక్కువ భాగం అతడు రోగియైయున్నట్టే మనం క్షేమంగా ఊహిస్తున్నాం. 7వ వచనంలో కన్పిస్తున్నట్టు, తనంతటతాను దిగలేని అసమర్థతలో అతడున్నాడు. అతడు నీరసుడో, కురూపియో, పక్షవాయువువాడో.

6వ వచనానికి సెట్టింగ్ యిది. ''యేసు, వాడు పడియుండుట చూచి, అతడప్పటికి బహుకాలమునుండి ఆ స్థితిలో నున్నాడని ఎరిగి - స్వస్థపడగోరుచున్నావా?'' అని వాని నడిగారు. రోగులు కూడియున్న ఆ కోనేటికి యేసు ఒక (నిర్దిష్టమైన) ఉద్దేశం కొరకు వచ్చారు. పట్టణంలో ఆయా స్థలాలను సందర్శిద్దామని ఆయన అక్కడికి వచ్చియుండలేదు. నిస్సందేహంగా తన జాలి ఆయన్ను అక్కడికి రాజేసింది.

యేసు ఆ కోనేటిని సమీపించినప్పుడు - ముప్పది ఎనిమిది ఏండ్లనుండి పడియున్న యొకని చూచారు. (అయితే) ఈ మనుష్యుని బాగు చేయడానికి యేసు ఎందుకు నిర్ణయించు కొన్నారు? (వాస్తవంగా) ఆ కోనేటి చుట్టు నున్నవారందరిలో యేసు ఈ ఒక్కనినే బాగుచేసినట్టున్నారు. ఈ సంఘటన విషయంలో ఎలాటి సందేహముండదు గనుకనా? అతడు నిరీక్షణ లేనివాడే. యేసు నిరీక్షణ లేనివారికి నిరీక్షణయు, నిస్సహాయులకు సహాయకుడై యున్నందుననా? స్నేహితులు లేని వారికి యేసు స్నేహితుడు గనుక, అతనికి స్నేహితులు లేనందుననా? కుక్కపిల్లను ఎన్నుకోమని చెప్పబడ్డ ఒక పసివానిలా యేసు ఉన్నందుననా? పెద్దవి, బలిసినవి చిన్నవాటిని ప్రక్కకు నెట్టివేస్తాయి గనుక పసివాడు చిన్నపిల్లను ఎన్నుకుంటాడు.

కారణమేమైయున్నా, అతడు చాలకాలంగా ఆ స్థితిలో పడియున్నాడని (ఖచ్చితంగా 38 సంవత్సరాలు) చూచి - ''నీవు బాగుపడడానికి యిష్టపడుతున్నావా?'' అని ఆయన అడిగారు. అలాటి వింతైన ప్రశ్నను యేసు ఎందుకు అడిగారో కొంచెంసేపు మనం సతమతమౌదాం.

ఆగి దాన్ని గూర్చి ఆలోచించు. 38 ఏండ్లనుండి రోగియైయుండడమే కష్టం.

అయితే మరోవిధంగా అతడు దాన్ని తేలిగ్గా తీసికొన్నట్టున్నాడు. ఎవరో ఒకరు ప్రతిరోజు ఆ కోనేటి దగ్గరకు తెస్తారు. బాధ్యత లేకుండ ప్రతి రోజు అతడు పండుకొని ఉన్నాడు. ఒకవేళ కొద్దిగా ధర్మం కూడా అడుక్కొన్నాడేమో. ఇతరులు నిర్ణయాలు చేశారు; యింకెవరో (వాని కొరకు) పనియంతా చేశారు. తన విధికి రాజీనామా చేసి, గత్యంతరం లేని దాన్ని అతడంగీకరించినట్టున్నాడు. మిగిలిన తన జీవితమంతా, గతంలో ఉన్నట్టే చిత్రింపబడింది. మరో వైపు, అతడు వెంటనే స్వస్థపరచబడితే, తన జీవనాన్ని తాను సంపాదించుకోవలసి వస్తుంది. ఉద్యోగాలకు పోటీ పడే మార్కెట్టులో అతడు ప్రవేశింపవలసి వస్తుంది. దానిలో పరితాపకరంగా ఓడిపోయే అవకాశాన్ని అతడు ఎదుర్కోవలసి వస్తుంది.

''నీకు నిజంగా దాన్ని కోరేది రూఢియేనా? నీవు దానికి సిద్ధంగా ఉన్నావా?'' అని యేసు అడుగుతున్నారట!

కొందరికి వ్యాధిలో ఉండటం అనుకూలంగా వుంటుంది. ఒకడు తన ''అనారోగ్యంలో (సంతోషాన్ని) అనుభవిస్తాడ''న్న ప్రాచీన ప్రయోగాన్ని నీవు వినియుండవచ్చు. తమ కొరకు కనిపెట్టుకొనడాన్ని కొందరు యిష్టపడతారు. కొందరు శ్రద్ధను పొందగోరుతారు. తాము చేయ నిష్టపడని దాన్ని చేయకుండా ఉండడానికి సాకును వెదుకుతారు. ఇతరులను స్వాధీనంలో ఉంచుకొనడానికి కొందరు అనారోగ్యాన్ని నేర్పుగా ఉపయోగిస్తారు.

యేసు యొక్క ప్రశ్న మొదట కన్పించినంత వింతగా లేదు, కదూ?

## మనస్సును స్వస్థ పరచుట (యోహాను 5:7-13)

ఈ ప్రశ్నలోనికి లోతుగా వెళ్ళుదాం. యేసు అందరిని ఎరిగినవాడు వారేమను కుంటున్నారో ఆయన ఎరుగు (యోహాను 2:25ను పోల్చి చూడు). సమాధానాన్ని కనుక్కోవాలని ఆయన ప్రశ్నించలేదు. కాని అతని అంతరంగాన్ని తాను చూచుకొనేలా ఆయన ప్రశ్నించారు. శరీరాన్ని బాగుచేయడంలోనే యేసు శ్రద్ధ కలిగియుండలేదు. మన మనస్సును స్వస్థపరచాలని కూడా ఆయన అక్కర కలిగియున్నారు. ఆరోగ్యకరమైన స్వభావ లక్షణాలను పెంపొందించాలని ఆయన కోరుతున్నారు.

యేసు ప్రశ్నను మందలింపుగా అతడు తీసికొన్నాడు. ఆ ప్రశ్నను అతడెలా తీసికొని యుంటాడంటే - ''నీవు బాగు పడగోరితే, ఎందుకు బాగుపడలేదు? నీళ్ళు కదిలింపబడినప్పుడు నీవు మొదటి వాడవుగా ఉండేలా కోనేటిలోనికి నీవు తీవ్ర వేగంతో ఎందుకు పోకూడదు?'' (అందుకు) ''ఆ రోగి - అయ్యా, నీళ్లు కదిలింపబడినప్పుడు నన్ను కోనేటిలోనికి దించుటకు నాకు ఎవడును లేడు గనుక నేను వచ్చునంతలో మరి యొకడు నాకంటె ముందుగా దిగునని ఆయనకు

ఉత్తరమిచ్చెను'' (7వ.).

ఈ కోనేరు చాల లోతైనది, లోతు లేని దరి (ఒడ్డు) లేదు. నీళ్లలోనికి దిగి వెళ్లే మెట్లు లేవు. కోనేటిలోనికి వెళ్ళాలంటే నడువలేని వానికి సహాయం కావాలి నీరు బుగ్గలుగా ఉబికినప్పుడు - ''ప్రతివాడు తనకు తానే'' (చూచు కుంటాడు) గనుక ఆ రోగికి తరుణం దొరకలేదు. ఆ ప్రశ్నకు ''అవును'', ''కాదు'' అనకుండ ఆ మనుష్యుడు - ''అది నా తప్పుకాదు - నేను యింకా రోగినే! నీళ్లలో దింపడానికి నా కెవ్వడూ లేడు!'' అన్నట్టున్నాడు, మనకు సమస్యలు ఎదురైనప్పుడు, అది మన తప్పుకాదు, కదూ? ఎవడో నన్ను ముంచాడని మనం తరచుగా అనుకొంటాం. ఈ రోగిలా మనకు కూడా మానసిక చికిత్స అవసరమేమో.

యేసు అతన్ని అంత తేలిగ్గా వదలి పెట్టలేదు. యేసు ఎక్కువ విభాగాలుగల స్వస్థత చేయగోరారు. అతని శరీర స్వస్థతోపాటు, వాని మానసిక రోగాన్ని కూడా ఆయన బాగు చేయాలని యున్నారు. గనుక ''యేసు నీవు లేచి నీ పరుపెత్తుకొని నడువుమని వానితో'' చెప్పారు (8వ.). ముప్పై ఎనిమిది సంవత్సరాలు అతని పరుపు అతన్ని మోసింది. ఇప్పుడు తన పరుపును తానే మోసేలా ఆయన ఆదేశించారు.

ఒక నిమిషం ఆగు. తాను చేయలేనని అతడు చెప్పిన పని అదే! అతడు నడువ గలిగియున్నట్లయితే, నీటిలోనికి మొదట వెళ్ళి యుండేవాడే. వాస్తవానికి, ఆ మనుష్యుడు నడువగలిగి యుండినట్లయితే, ఆ కోనేటి యొద్ద ఉండేవాడే కాదు. అసాధ్యమైన దాన్ని చేయుమని యేసు ఆ మనుష్యుని అడుగుతున్నారు. ''నడువ ప్రయత్నించునంతగా నీవు స్వస్థత పొందగోరుతున్నావా?'' అని ఆయన ఆ మనుష్యుని అడుగుతున్నారు.

యేసులో ఉన్నదేదో ఒకటి ఆ మనుష్యుని ఆకట్టుకుంది. యేసు ఎవరో అతడెరిగికాదు. తన్ను ఆయన బాగు చేస్తాడనే విశ్వాసముండి కాదు. ఇంతవరకు యేసు ఎవరో అతనికి తెలియదని 13వ వచనంలో చూడబోతాం. అయితే ప్రయత్నించడానికి అతడు తీర్మానించుకొన్నట్టున్నాడు. ''వెంటనే వాడు స్వస్థత నొంది తన పరుపెత్తుకొని నడిచెను'' (9 వ.). ప్రభువు చేసిన స్వస్థతలన్నిటివలె ఇది కూడా ఆలస్యం లేనిది, పూర్ణమైనది, (మనం చూడ బోయేలా) ఒప్పించునది.

నా శరీరంలోని అవయవాలు కొన్ని నెలల తరబడి కదలింప బడకుండేలా జీవితంలో చాలా గాయాలు నాకు తగిలాయి. ఆయా అవయవాలు ఉపయోగింప బడకుండ ఉన్నందున కలిగిన కండర నష్టం, కదలిక నష్టం, వగైరాల ఫలితమేమో నాకు తెలుసు. (అలాటప్పుడు) ముప్పై ఎనిమిది సంవత్సరాలు దాన్ని ఉపయోగించక పోతే, యిక అతని శరీరం ఎలా వుందో ఊహించు. అయినా యేసు వాని స్వస్థ పరచినప్పుడు చూచేవారికి అతని దేహం తిరిగి పూర్ణంగా, దృఢంగా ఉన్నట్టు కన్పించి యుంటుంది.

ఈ చిన్న గమనికలోనికి యోహాను సబ్బాతు దినాన్ని విసిరాడు: ''ఆ దినము విశ్రాంతి దినము'' (10a వ.). తన శత్రువుల ఎదుర్కోలు కొరకు యేసు సబ్బాతు దినాన ఆ మనిషిని స్వస్థపరచారా? అయ్యుండొచ్చు. ఒక సందర్భంలో ఆయన అలా చేశారు (మత్తయి 12:1-14). యేసు సబ్బాతు దినాన స్వస్థ పరచడం అనేది కేవలం సంభవాల కలయికయైయుండవచ్చా? కావాలనే చేసిందో, లేక సంభవాల కలయిక అయ్యిందో, ఏది ఏమైనా, (స్వస్థ పరచింది) సబ్బాతు దినమైనట్టు యోహాను మనలను తెలిసికోగోరాడు. ఎందుకంటే తరువాత ఏమి జరిగిందో యిది వివరిస్తుంది.

---

**నీ సమస్య ఏదైనా సరే, నీవు ఆయన్ను చేయనిస్తే,**

**వెల చెల్లించ నీవు యిష్టపడితే యేసు**

**నీకు నాకు సహాయం చేయగలడు.**

---

ఆ మనుష్యుడు లేచి నడిచేటప్పుడు ఆ కోనేటి చుట్టు ఎలాటి ఉద్రేకింపజేయబడిన పరిస్థితి నెలకొన్నదో ఆలోచించు! అదెలాగున్నా, అక్కడ ఉన్న కొందరు ఆనందించలేదు. అద్భుతం జరిగిందనే దాన్ని వారు ప్రశ్నించలేదు. ఉత్తరువు చేయబడ్డ చట్టాన్ని గూర్చి వారు ఎక్కువ అక్కర గలిగియున్నారు. ''గనుక యూదులు - ఇది విశ్రాంతి దినముగదా; నీవు నీ పరుపెత్తికొన తగదే అని స్వస్థత నొందినవానితో చెప్పిరి'' (10వ.). అది విచారకరం కదా? స్వస్థత విషయం వారేమీ చెప్పలేదు. ఒక మనుష్యుడు బాగు చేయబడ్డాడనేది వారికి దుఃఖకరంగా వుంది. ''నీవు మా పారంపర్యాల్లో ఒకదాన్ని మీరావు!'' అని అంటున్నారు.

''సబ్బాతు'' అంటే అసలు ''విశ్రాంతి'' అని అర్థం. దేవుడు లోకాన్ని సృజించి నప్పుడు ఏడవ దినాన విశ్రమించారు (ఆది. 2:1-3). తరువాత సబ్బాతు అని పిలువబడే ఏడవ దినపు విశ్రాంతి, పది ఆజ్ఞలలోని భాగంగా చేయబడింది (నిర్గమ. 20:8-11). సబ్బాతు అనేది యూదులకు ప్రత్యేకమైన సమయం. అది విశ్రాంతి తీసికొనే దినం, ఆరాధించే దినం, దేవుని గూర్చి చింతించే (ఆలోచించే) దినం, ఆనందించే సమయం. విశ్రాంతిని నిశ్చయంగా పాటించడానికి గాను, దాని నతిక్రమించిన వారికి కఠినదండనను దేవుడు విధించారు. సబ్బాతు దినాన కట్టెలేరి నందుకు సంఖ్యా. 15లో ఒకడు రాళ్లతో కొట్టబడ్డాడు. సబ్బాతు దినాన వ్యాపారం చేసినందుకు నెహెమ్యా గ్రంథంలో కఠిన శిక్ష విధింపబడినట్టు చెప్పబడింది.

దేవుని చట్టాలు తగినంత కఠినంగానే ఉన్నాయి. అయితే మనుష్యులు వాటిని అలా విడిచి పెట్టడానికి యిష్టపడడం లేదే. పరిసయ్యులు సబ్బాతు చట్టాని పెద్దది చేసి, 23 అధ్యాయాల నియమాలను దానికి కలిపారు. వాటిలో అనేక నియమాలు హాస్యాస్పదంగా ఉంటాయి. ఉదాహరణకు, ఒకడు తన వ్రేలి గోళ్లను కొరకకూడదు, అది విశ్రాంతి దినాన పని చేసిన లెక్క క్రిందికి వస్తుంది. నిశ్చయంగా పాటించవలసిన అనేక నియమాలు బరువులు మోయాడానికి సంబంధించినవే. కృత్రిమమైన దంతాలుగాని, కాళ్లుగాని వేసికోకూడదు. అలా వేసికొనడం బరువులు మోయడ మేనని రబ్బీలు వాదించారు. ఒక స్త్రీ తన భర్త అంగీని సరిచేసి, ఆ అంగీలో ఒక సూదిని గుచ్చి అనాలోచనగా వదలి వేసిందనుకో, అతడు అలాగే ఆ అంగీని సబ్బాతు దినాన వేసికొంటే, పాపం చేసినట్టే, ఎందుకంటే సబ్బాతు దినాన సూదిని మోశాడు గనుక! (ఈ హద్దులు దేవుడు విధించినవి కావు మనుష్యుడు విధించినవేనని గ్రహించాలి).

వారి నియమాల్లో ఒక దానికి యోహాను 5కు నేరైన సంబంధముంది. దానిపైన మనిషిని ఉంచి పరుపును మోసికొని వెళ్ళ వచ్చునట. ఆ సందర్భంలో పరుపు అనేది ''ముఖ్యం కాదని'' రబ్బీలు చెప్పారు - అయితే మనిషి దానిపైన లేని ఖాళీ పరుపును మాత్రం మోయకూడదట. అయినా, యేసు మోసికొని పొమ్మని చెప్పింది యిదే: ''నీవు లేచి నీ పరుపెత్తుకొని నడువుమని'' వానితో చెప్పారు.

''ఇది విశ్రాంతి దినము గదా; నీవు నీ పరుపెత్తికొనతగదే'' అని పరిసయ్యుల న్నప్పుడు (10వ.), అతడన్న మాటల్లో భావమేమంటే, ''అది నా తప్పుకాదు''. (నేను నడువక పోవడం నా తప్పుకాదని అతడు యేసుతో చెప్పాడు). ఇప్పుడు పరిసయ్యులతో అతడు - ''నేను నడవడం నా తప్పుకాదు'' అని చెప్పాడు. ''అందుకు వాడు - నన్ను స్వస్థపరచినవాడు - నీ పరుపెత్తికొని నడువుమని నాతో చెప్పెను'' అని తెలిపాడు (11వ.). ఇంకోవిధంగా చెప్పాలంటే నన్ను స్వస్థపరచే అధికారం గలవాడు, నా పరుపెత్తుకొని నడువుమని చెప్పడానికి తప్పక అధికారం కలవాడై యుండాలి'' అని తెలిపాడన్నమాట.

అందుకు ''వారు - నీ పరుపెత్తికొని నడువుమని నీతో చెప్పిన వాడెవడని వానిని అడిగిరి. ఆయన ఎవడో స్వస్థత పొందిన వానికి తెలియలేదు; ఆ చోటను గుంపు కూడి యుండెను గనుక యేసు తప్పించుకొని పోయెను'' (12-13 వచ.). ముందు చెప్పిన వాస్తవాన్ని గమనించు: యేసు అంటే ఎవరో అతనికి ఏ భావమూ లేదు. యేసు అతన్ని బాగు చేశారు; జన సమూహంలో తప్పించుకు పోయారు.

## ఆత్మను స్వస్థపరచుట (యోహాను 5:14-16)

ఆ మనిషితో యేసు తన పని ముగించలేదు. ''అటు తరువాత యేసు దేవాలయములో వానిని చూచి (తాను స్వస్థత పొందినందుకు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించడానికి అతడు వచ్చియుంటాడు) - ఇదిగో స్వస్థత నొందితివి, మరి యెక్కువ కీడు నీకు కలుగకుండునట్లు ఇకను పాపము చేయకుమని'' చెప్పెను (14 వ.). ''ఎక్కువ కీడు'' అని యేసు పలికింది అధికమైన రోగం అనేది కావచ్చు, నరకానికి కూడా సంబంధించియుండవచ్చు. జీవితం ఎంత కీడుగా మారిపోయినా నిత్య నరకాగ్నితో అది ఎంతమాత్రం పోలియుండదు.

ఎక్కువ మంది వ్యాఖ్యాన కర్తలు - అతని జీవితంలోని పాపం తన వ్యాధికి కారణంగా యేసు మాటలు సూచిస్తున్నట్టు అన్నారు. అది కావచ్చు. అయితే యోహాను 9లో అనారోగ్యమంతా వ్యక్తిగత పాపంవలనే రాలేదని యేసు వక్కాణించారు. అదె లాగున్నా, కొన్ని రోగాలైతే HIV క్రిమి, AIDS వ్యాధి వలన రుజువు చేయబడ్డాయి HIV క్రిమి కలిగిన వారందరు పాపం చేశారని కాదు, కాని ఆ క్రిమి ఉన్నవారితో ఎక్కువ మంది లైంగిక పాపం వలన దాన్ని పొందారు.

మానవ జీవితంలోని పాపానికిని, వాని దేహ సంబంధమైన పరిస్థితికిని ఎలాటి సంబంధం లేకుండానే పోవచ్చు. గనుక ఆ మనుష్యుని బహు గొప్పదైన సమస్యను నిర్వహించడంలో ఆయన ఊరకనే అలా కోరి యుండవచ్చు. యేసుయొక్క విషయానుక్రమణిలో ఎల్లవేళల మొదటిది - ఆత్మను స్వస్థపరచడమే; దేహాన్ని కాదు. (గత 38 సంవత్సరాలుగా ఆ మనుష్యుడు ఎక్కువ చెడుగు చేయలేక పోయాడు. అందువలన అతడు రోగిగా ఉన్నప్పుడు చేయలేనివన్నీ అతడు చేయకూడని వాటితో కలిపి పథకం వేసికొంటున్నాడు గనుక - ఇకను పాపము చేయకుమని యేసు అతనికి చెప్పినట్లు - నా స్నేహితుల్లో ఒకడన్నాడు).

తన మాటలవలన యేసు ఏమి ఉద్దేశించియున్నా, ''ఇకను పాపము చేయకుమన్న'' ఆ ఒక సత్యం - విదితమే. మానవ ఆత్మసంబంధమైన పరిస్థితి విషయమై యేసు శ్రద్ధ కలిగియున్నాడు. ఒకవేళ మనిషిశరీరమే బాగై, దేవునితో వాని బాంధవ్యం తప్పుగానే మిగిలి యున్నట్టయితే, భౌతికమైన స్వస్థతకు పెద్ద విలువ ఉండేది కాదు. యేసు మానవ దేహాన్ని గూర్చి శ్రద్ధ కలిగియున్నారు; మానవ మనస్సును గూర్చి, వీటన్నిటి కంటే పైగా, మానవ ఆత్మను గూర్చి ఎక్కువైన శ్రద్ధ కలిగియున్నారు.

15వ వచనంతో సంఘటన మిగిలిపోతుంది: ''వాడు వెళ్లి తన్ను స్వస్థపరచినవాడు యేసు అని యూదులకు తెలియజెప్పెను''. నీవు నీ పరుపెత్తికొని నడువమన్నది ఎవడు అని ముందుగా యూదులు అతని అడిగిన ప్రశ్నకు అతడు యేసును గూర్చి ప్రేలుతున్నట్టున్నాడా అయినా అతడలా చేశాడని నేననుకోను. అతని సాక్ష్యమేమో గమనించు. తన పరుపెత్తుకొని తన్ను నడువమని చెప్పింది యేసు అని అతడనడంలేదు.

తన్ను స్వస్థపరచినవాడు యేసు అని అతడంటున్నాడు. అతడు యిప్పుడు యేసునందు విశ్వాసముంచాడు. గనుక తన ప్రభువుయొక్క శక్తికి వ్యక్తిత్వానికి అతడు సాక్షిగా నిలిచాడు. అతని శరీరం, మనస్సులతో పాటు వాని ఆత్మ కూడా స్వస్థపరచబడింది.

ప్రచురణ సూచనతో యోహాను ఈ సంఘటనను యిలా ముగిస్తున్నాడు: ''ఈ కార్యములను విశ్రాంతి దినమున చేసినందుకు యూదులు యేసును హింసించిరి'' (16వ.).

## యేసు మనందరిని స్వస్థపరచగలడు

కోనేటి వద్దనున్న మనుష్యుని స్వస్థపరచిన సంఘటనకు యిది అంతమేగాని, మన పాఠ్య భాగాన్ని యింకా పూర్తి చేయలేదు. ఈ సందర్భంలో ఉన్న మరో గుంపును గూర్చి మనం ఆలోచించాలని కోరుతున్నా. అప్పుడు మనలో ప్రతివానికి దాన్ని వర్తింప చేయకోరుతున్నా.

### పరిసయ్యుల కొరకైన ప్రశ్న

''మీరును స్వస్థపడగోరుచున్నారా?'' అని యూదా మత నాయకులను కూడా యేసు అడిగియుండేవారే. ఆ సంగతిని ఆలోచించడానికి నీ వెప్పుడైనా ఆగేవా? దీన్ని ఆలోచించు. అపొస్తలుల తరువాత, యేసుయొక్క అద్భుతాలను ఎక్కువగా చూచి ఆయన బోధను తక్కిన వారికంటె ఎక్కువగా ఎవరు వినియుంటారు? తన విమర్శకులు: తన్ను చిక్కించుకోవాలని ప్రతి స్థలానికి ఆయన్ను వెంబడించినవారు; ఆయన మీద నేరం మోపడానికి ఏదో యొక దాన్ని కనిపెట్టాలనుకున్న - శాస్త్రులు, పరిసయ్యులు. మనం చదువుతున్న సంఘటనకు కొంచెం ముందుగా, వారు గోధుమల చేనిలో దాగియున్నారు! వారు సబ్బాతు దినాన వెన్నులు తుంచుకొని తింటూ, సబ్బాతును ఉల్లంఘించారని ప్రభువుయొక్క శిష్యులపై నిందవేశారు (మత్తయి. 12:1 -2).

ఆత్మసంబంధంగా ప్రభువుచే స్వస్థపరచబడడానికి వారికి ప్రతి అవకాశముంది. సంవత్సరాల తరబడి యూదా జనాంగం మెస్సీయా కొరకు కనిపెట్టుకొనియుంది. మెస్సీయాను గూర్చిన ప్రవచనాలు వారికి తెలుసు. మెస్సీయా ఎలా ఉంటాడు, ఆయన ఏమి చేస్తాడు అనేవి వారికి ఎరుకే. యేసు ప్రతి ప్రవచనాన్ని నెరవేర్చారు.

''మాకు మెస్సీయా రావాలి! మా జనాంగాన్ని ఆయన స్వస్థ పరచాలి'' అని వారు కోరుకున్నవారే! ''నీవు బాగుపడాలని నీవు నిశ్చయంగా కోరుతున్నావా?''

యోహాను 5, చివరి భాగంలో, యూదా మత నాయకులను ఉద్దేశించి యేసు చేసిన ప్రసంగాల్లో ఒకటుంది (19-47వచనాలు). ఆ ప్రసంగంలో యేసు మూడు ప్రధానమైన భాగ్యాలు తనవన్నట్లు చెప్పుకున్నారు. (1) ఆయన దేవునితో సమానుడు,

(2) దేవుని క్రియలు జరిగించినవాడు (3) దేవుని యొక్క శక్తి తనకున్నట్లు చెప్పుకున్నారు. ఆత్మసంబంధమైన జీవాన్ని ఆయన యిచ్చారు (21వ.). ఆయన మృతులను లేపుతాడు (22-23 వచనాలు). కోట్లకొలది మందిని రక్షించడానికి కావలసిన సత్యమూ, రుజువూ ఆయన ప్రసంగంలో వుంది.

''ఆత్మసంబంధమైన మీ రోగాలన్నిటినుండి మీరు బాగు పడగోరుతున్నారా?'' అని ఆయన వారిని అడిగి యుండేవారే. ఆయన అలా అడిగి యున్నట్టయితే ''అవును మా పారంపర్యాచారాలను, మా దురభిప్రాయాలు లేక అకారణ ద్వేష బుద్ధిని మానుకోవాలనే భావం లేకుండాపోతే మాత్రం సరే అని యుండేవారే''. వేరే విధంగా చెప్పాలంటే - ''విలువ చెల్లించవలసిన అవసరత లేనంతవరకు, అది మాకు కావాలి'' అని వారు సమాధాన మిచ్చియుండేవారే.

**ఆ ప్రశ్న మనకు**

ఆ ప్రశ్న మన వైపుకు మరల్చబడడానికి సిద్ధంగా ఉన్నామా? నేనుహెచ్చరించే దేమంటే: అది మనలను గాయపరచవచ్చు! మనలను గ్రుచ్చవచ్చు! అది మనకు అసౌకర్యంగా ఉండవచ్చు. (నేను నీకిచ్చే అభయమేమంటే - అది నిన్ను బాధించే దానికంటె నన్ను ఎక్కువగా బాధిస్తుంది, అని మా తండ్రి అనేవాడు!).

నీవు మించిన బరువుగా ఉన్నావా? నీ బరువును నిజంగా తగ్గించుకో గోరు తున్నావా? మరో రకంగా చెప్పాలంటే - ఆహార పత్యముండటం, వ్యాయామం చేయడం అనే విలువ చెల్లించడానికి నీవు యిష్టపడుతున్నావా? (మన చుట్టు ఉన్నవారు తమకు కావలసినవన్నీ తింటున్నట్టుండగా, మనం కోరుకున్నవి తినకుండ ఉండాలంటే ఎంత బాధగా వుంటుంది!)

ఈ రోజున అనేకులున్న సంకటమైన పరిస్థితిలో నీవున్నట్టు కనబడుతుందా?; పెద్దగా అనారోగ్య మేమీ నీకు లేదా, అయినా నీకు బాగులేనట్టే తలంచుతున్నావా? నీవు బాగా ఉన్నట్టు అభిప్రాయ పడగోరుతున్నావా? తగిన భోజనం చేస్తూ, కావలసినంత వ్యాయామాన్ని పొందుతూ, నీ దేహం, మనస్సు, ఆత్మ విశ్రాంతిగా ఉండేలా నీ జీవితంలో మొదటిగా చేయవలసిన పనులేవో తిరిగి ఆలోచింప నిష్టపడుతున్నావా?

నీవు మంచిగా మసలుకోలేని వ్యక్తి ఎవరైనా ఉన్నారా? ఆ వ్యక్తితో నీ బాంధవ్యాన్ని మెరుగు పరచుకొన నిష్టపడుతున్నావా? నీవు (తగిన) వెల చెల్లించడానికి యిష్టపడు తున్నావా? నీ గర్వాన్ని అణచుకొని - ''నేను పశ్చాత్తాపపడుతున్నా''నని అతనితో చెప్పడానికి యిష్టపడుతున్నావా? ఎదుటివాడు మేలైనది చేసినా చేయక పోయినా, నీవు మేలైన దానిని చేయగల పెద్దవాడవుగా ఉండగలవా? సేవకుడవుగా ఉండడానికి నేర్చుకోగలవా?

మేలైన వివాహ బంధం, ఆనంద దాయకమైన గృహం కలిగియుండాలని కోరుతున్నావా? కావాలని మనమంటాం. అయితే వాటిని పొందడానికి, సాధారణంగా మనలోనే మార్పు జరుగ వలసి వస్తుంది ... అట్టి మార్పులో బాధ ఉంటుంది ... ఆ బాధను సహించడానికి యిష్టపడం.

నీవు దోషారోపణతో నింపబడ్డావా? ఆ అంతరంగ వేదనను పోగొట్టుకో గోరుతున్నావా? దేవుని సన్నిధిలో (దృష్టిలో) నిన్ను నీవే తగ్గించుకొని, ఆయన చిత్తానికి పరిపూర్ణంగా లోబడడానికి నీవు యిష్టపడుతున్నావా? నీవు నీ పాపముల విషయంలో హృదయ రోగివైయుండి నీ జీవిత విధానాన్ని మార్చుకోడానికి యిష్టపడు తున్నావా? (బైబిలు దాన్ని "మారుమనస్సు" అని అంటుంది). ఒకవేళ నీవు బాప్తిస్మం (నీటిలో ముంచడం) నీ పాప క్షమాపణ కొరకు (అపొ. 2:38) పొందక పోతే, నీవు దాన్ని చేయడానికి యిష్ట పడుతున్నావా? నీవు ఒక వేళ పాపము చేసిన దేవుని బిడ్డవైతే, దేవుని కనికరముపై నిన్ను నీవు పడవేసికొంటావా? (1 యోహాను 1:9). ఒక వేళ నీ క్రియలు నీ పలుకుబడిని (మంచితనాన్ని) బోధించితే, బహిరంగంగా వాటిని ఒప్పుకొని తిరిగి నూతనంగా ప్రారంభించడానికి యిష్టపడుతున్నావా? (యాకోబు 5:16). విలువ చెల్లించడానికి నీవు యిష్ట పడుతున్నావా?

నీ సమస్య ఎలాటిదైనా సరే, ఆయనను నీవు చేయనిస్తే, తగిన విలువ చెల్లించడానికి నీవు యిష్టపడితే యేసు నీకు సహాయం చేయగలరు. మేలైనది చేయడానికి ప్రయత్నించు. కోనేటివద్ద మనుష్యుడు ప్రయత్నించగా, నిలువడానికిని, నడవడానికిని, యేసు వానికి శక్తి నిచ్చారు. నీవు చేయలేనివి ఆయన చేయునట్లు యేసునందు నమ్మిక యుంచుము.

యేసు మన దేహములను, మనస్సులను, ఆత్మలను స్వస్థపరచగలరు.

## ముగింపు

యేసు ఎల్లవేళల ఆత్మ విషయమై అత్యధికమైన అక్కర కలిగియున్నారు. "మరి యెక్కువ కీడు నీకు కలుగకుండునట్లు ఇకను పాపము చేయకుము" అని ఆయన ఆ మనుష్యునికి చెప్పారు (14 వ.). ఇప్పుడే యేసు మన ఆత్మలను బాగుచేయగో రుతున్నారు. లేచి ఆయనతో కూడ నడిచేలా ఆయన మనలను పిలుస్తున్నారు. అయినా, మనం ఎక్కడున్నామో అక్కడే నిలిచియుండగలం. "నీవు లేచి నీ పరుపెత్తికొని నడువుమని" ఆయన అతనికి ఆదేశించినప్పుడు, అతడు ఆ పని చేయవలసిన అవసరతలేదు. అతనికి స్వాతంత్ర్య ముంది. అతడు దానిపై పండుకొని యుండవచ్చు. ఆ దుస్థితిలోనే తాను మరణించి యుండవచ్చు. అలాగే, యేసు మనలను పిలిచేటప్పుడు, మన యిష్టం జరిగించుకొనే స్వాతంత్ర్యముంది. ఏమి చేయకుండ మన పరుపుల మీద ఉండడం హాయిగానే ఉంటుంది, అయితే మనం ఎన్నడూ

స్వస్థత పొందనేరం! నిర్ణయం మనదే.

పరిసయ్యులవలె ఉండకుండునట్లు దేవుడు మనకు సహాయం చేయును గాక. మన పారంపర్యాచారాలను దురభిమానాలను విడిచి పెట్టునట్లు ఆయన మనకు సహాయం చేయునుగాక. ప్రభువునకు మనలను మనమే అప్పగించుకొందాం. ఆయన మనలను బాగుచేస్తారు.

నీవు నిజంగా స్వస్థత పొందగోరుతున్నావా? నీ వైఖరియే దీనికి నీ జవాబును సూచిస్తుంది.

## వారికి కలిగిన దంతయు

క్రీస్తును, ఆ ముత్యాన్ని, పొందడానికి ఆ వ్యాపారి తనకు కలిగిన దంతయు అమ్మాడు, జయం పొందాడు (మత్తయి. 13:46).

పాపియైన చిన్నకుమారుడు లౌకిక సుఖం పొందడానికి తనకు కలిగిన దంతయు వ్యయం చేశాడు - కాని అపజయం పొందాడు (లూకా 15:13-14).

రోగియైన స్త్రీ ఆరోగ్యం పొందడానికి తనకు కలిగిన దంతయు ఖర్చుచేసింది, అయినా అపజయం పొందింది (మార్కు 5:26).

పేద విధవరాలు తనకు కలిగిన దంతయు ప్రభువునకు సమర్పించింది; చివరికి ఆయన మెప్పును పొందింది (మార్కు 12:43-44)

**ఆర్కిబాల్డ్ నెయిస్మిత్**

సూచన

[1]కొన్ని ప్రాచీన ప్రతులలో - ''ఆ పండుగ'' అని వ్రాయబడింది. ఒక వేళ అది సరియైన రూపమైతే - ''ఆ పండుగ'' పస్కాపండుగను సూచించియుండవచ్చు.